

ఫలితాల్లో రోల్ మోడల్

టేక్మాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు విద్యాబోధనలో మెళకువలు పాటిస్తూ.. ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాలు 8లో ▸



బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు 8లో ▸



కూలిన చెట్టును...

ఈదురుగాలులకు రోడ్డుపై కూలిన చెట్టును ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణికులు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం

రామాయంపేట(మెదక్): ఉద్యోగులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించకపోతే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని ప్రగతి ధర్మారంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో మాట్లాడారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఈ మేరకు ఆసుపత్రిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వడదెబ్బకు గురైనవారికి వెంటనే సపర్యలు చేపట్టాలని, ముఖ్యంగా గర్భవతులు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఆసుపత్రి డాక్టర్ హరిప్రియ, ఏఎన్ఎంలు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): వర్షాలు ప్రారంభమవుతున్న దృష్ట్యా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా చేయాలని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి ఆదేశించారు. మండలంలోని హస్తాల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. కాంటాలో మోసం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించడంతో పాటు రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ బాలాలక్ష్మి, ఏఓ రూప్సీ, గిర్దావర్ నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.

ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు: డీఆర్‌ఓ



వడియారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌ఓ భుజంగరావు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌ఓ భుజంగరావు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు వివరాలను వెంటనే నమోదు చేసి డబ్బులు రైతులకు త్వరగా వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఆర్‌ఐలు భరత్‌రెడ్డి, సంతోష్‌రావు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కల్గించవద్దు: డీఆర్‌డీఓ



వెంకట్రావ్‌పేటలో కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు ఇబ్బందులు లేకుండా వరిధాన్యం కొనుగోలు చేయాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకట్రావ్‌పేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం తేమశాతం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా వరిధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. నిర్వాహకులు ధాన్యం తూకం చేయగానే రైతుల వివరాలు తీసుకుని ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలన్నారు. గోనె సంచులు ఇతర సమస్యలుంటే వెంటనే తెలియ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన వడ్లు తీసుకురావాలన్నారు. తూకంలో తరుగు పేరున ఎక్కువ వడ్లు తూకం వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, సీసీలు నాగరాజు, నర్సింలు, శ్రీకాంత్, ఎఫ్‌పీసీ చైర్మన్ రాజేశ్వరీ రైతులు పాల్గొన్నారు.

తూకంలో చేతివాటం!

- తరుగు నష్టం రైతుకు... మిగులు ధాన్యం మిల్లర్లకా..?
- అన్నదాతకు అడుగడుగునా దగా

హవేళిఘణాపూర్(మెదక్): రైతే రాజు.. దేశానికి వెన్నెముక అని పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారే తప్ప.. వారి శ్రేయస్సు కోసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వాలు ఎన్ని మారినా.. రైతు బతుకు మాత్రం మారడం లేదు. అడుగడుగునా రైతుకు దగాకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విత్తు నాటినప్పటి నుంచి కోత కోసి అమ్మేంత వరకు దగాకు గురవుతూనే ఉన్నాడు. అసలే వాతావరణం సహకరించకపోవడంతో అల్లాడిపోతున్న రైతన్నకు సరిగా ధాన్యం కొనుగోళ్లు జరగకపోవడం.. తూకాల్లో మోసం.. సకాలంలో డబ్బులు చెల్లించడం ఇలా అనేక సమస్యలతో సతమతమవుతున్నాడు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేసిన రైతుల వద్ద నుంచి 40 కిలోల గోనెసంచులో పొల్లు ఉందనే సాకుతో రైతులు, రైస్‌మిల్లర్ల ఒప్పందంతో 42 కిలోల 200 గ్రాముల ధాన్యం తూకం చేస్తున్నారు. అయినప్పటికీ లారీల్లో ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు తరలించిన సమయంలో రైతుల సంచులకు మించిన బరువు ఎక్కువ వస్తే నోరు మెదపకుండా.. అదే తక్కువ వస్తే తరుగు పేరిట ధాన్యం, లేదా డబ్బులు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. తరుగు నష్టం రైతుకు.. మిగులు ధాన్యం మిల్లర్లకా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైస్‌మిల్లర్ల చేతివాటం కారణంగా వరిధాన్యం క్వింటాళ్ల కొద్ది నొక్కేస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఏదీ..?

లారీలు ఖాళీ చేసే సమయంలో అధికారులు పర్యవేక్షించి రైతుకు నష్టం జరుగకుండా చూడాలని కలెక్టర్ పదే పదే చెబుతున్నా.. అధికారులు ఈ విషయంలో మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఎవరైనా రైతులు ప్రశ్నిస్తే నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

తూకంలో తేడాలొస్తే సహించం

కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరిక

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు పండించిన ధాన్యం తూకంలో తేడాలు రావొద్దని, రైతులకు ఇబ్బందులు కాకుండా చూడాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తూకంలో తేడాలు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ధాన్యంకు సరిపడా వాహనాలను, ఎగుమతులు, దిగుమతులు వెంటనే జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే హమాలీలను సమకూర్చుకోవాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం అందించే మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీటీ కౌశిక, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

20న సార్వత్రిక సమ్మె

అధికారులకు నోటీసు ఇచ్చిన సీఐటీయూ

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. సమ్మెకు సహకరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో డీడబ్ల్యూఓకు అంగన్‌వాడీ యూనియన్, డీఎంహెచ్‌ఓకు ఆశ వర్కర్స్ యూనియన్ సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. 29 కార్మిక చట్టాలను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమలుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇదే జరిగితే కార్మిక సంఘాల శక్తి నిర్వీర్యం అవుతుందని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్స్- హెల్పర్స్, మినీ టీచర్ సమస్యలు, ఆశ వర్కర్ల సమస్యలు ఇలా ఏ ఒక్కటి పరిష్కారం చేయకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు యూసుఫ్ ఫాతిమా, నాగరాణి, ఆశా యూనియన్ నాయకురాలు రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



డీడబ్ల్యూఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సీఎం వ్యాఖ్యలు దురదృష్టకరం

- పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ
- పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్

మెదక్ కలెక్టరేట్: ఉద్యోగ, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకరి కృష్ణ, సామ్య నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు పర్చాలన్నారు. అలాగే జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి మాటలు బాధాకరమన్నారు. సబ్ కమిటీతో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో వెంటనే చర్చలు జరపాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. బకాయిలు కూడా విడుదల చేస్తామని ప్రకటించి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో పట్ల వారు వాపోయారు. రెండేళ్ల నుంచి ఉపాధ్యాయులు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు కూడా విడుదల చేయకపోవడం అన్యాయం అన్నారు. వాటిని ఉద్యోగ ,ఉపాధ్యాయ సంఘాల నాయకులు అడగడం తప్పు అని వారు ప్రశ్నించారు. ఎన్నికల హామీల భాగంగానే సీఎం ప్రకటించిన డీఏలను కూడా విడుదల చేయకపోవడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి, మెదక్ మండలం, మెదక్ పట్టణ, చిన్న శంకరంపేట ,హవేలీ ఘనపూర్, పాపన్నపేట బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్టీయూటీఎస్ నాయకులు

మా పథకాలు దేశానికే ఆదర్శం

- కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్లు సాయికుమార్, వరప్రసాద్
- కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

తూప్రాన్: క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పీసీసీ జిల్లా అబ్జర్వర్లు మెట్టు సాయికుమార్, ఉట్ల వరప్రసాద్ కోరారు. మండలంలోని యావపూర్‌లో ఓ ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లో తూప్రాన్, మనోహరాబాద్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్లు సాయికుమార్, వరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రూ.21 వేల కోట్లతో రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ పిలుపుమేరకు రాష్ట్రంలో కులగణన చేసి దేశానికి దిక్సూచీగా నిలిచామన్నారు. బీజేపీ నేడు దేశ వ్యాప్తంగా కులగణన చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే రైతులకు సన్నరకం వడ్లకు రూ.500 బోనస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, సన్నరకం రేషన్ బియ్యం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తదితర అభివృద్ధి, సంక్షేమ ఫలాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. త్వరలో జిల్లా, మండల, పట్టణ కమిటీలను నియామకం ఉంటుందని తెలిపారు. అనంతరం రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్త, మున్సిపల్ మాజీ చైర్మన్ జ్యోతికృష్ణ, మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, ఎలక్షన్‌రెడ్డి, దేవేందర్, విజయభాస్కర్‌రెడ్డి, ర్యాకల కృష్ణ, రాజుయాదవ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తూప్రాన్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా ఇళ్లను డీఆర్‌ఓ భుజంగరావు మంగళవారం ఆర్డీఓ జయచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి, ఎంపీడీఓ శేషాద్రిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను త్వరగా గుర్తించాలని సూచించారు. అనంతరం తూప్రాన్‌కు మంజూరు అయిన జూనియర్ సివిల్ కోర్టు భవనానికి అనువుగా ఉన్న మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంను ఇంటిగ్రేటెడ్ మార్కెట్లోకి త్వరగా మార్చాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

‘పేట’లో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో మంగళవారం రాత్రి రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్), స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజల భద్రత కోసం తాము ఉన్నామని భరోసా కల్పించడానికే ఈ కవాతు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కవాతు కొనసాగింది. స్థానిక సీఐ వెంకట్ రాజాగౌడ్, ఆర్ఏఎఫ్ కమాండెంట్ విజయకుమార్ వర్మ ఆధ్వర్యంలో కవాతు జరిగింది.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం ఆయన చిలప్‌చెడ్ మండలం బండపోతుగల్ గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతిలో అన్ని రకాల భూసమస్యలకు పరిష్కారం ఉందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. సాదాబైనామాల సమస్యలకు భూభారతిలో ఆప్షన్ ఉందన్నారు. అధికారులు అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్లు సహదేవ్, కమలాద్రి, శ్రీనివాస్‌చారి, డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, ఆర్‌ఐ సునీల్‌సింగ్ పాల్గొన్నారు.

అర్హులైన పేదవారికే ఇందిరమ్మ ఇళ్లు

అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ మంజూరు చేశామని కలెక్టర్ తెలిపారు. చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి, ఇందిరమ్మ ఇంటి పథకానికి ఎంపికైన లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. విడతల వారీగా డబ్బులు మంజూరు అవుతాయన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

యువ వికాస్ దరఖాస్తుల పరిశీలన

అల్లాదుర్గం(మెదక్): మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈఓ ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాస్ పథకం యువతకు వరంలాంటిదని చెప్పారు. ఈ పథకం యువత ఉపాధి పొందడానికి దోహదపడుతోందని పేర్కొన్నారు. సీఈవో వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ సజ్జద్ అలీ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి: సీఈఓ

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలో మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాస్ ధరఖాస్తులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ షాకీర్‌అలీ, సీనియర్ అసిస్టెంట్ కాశీరాం తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

ఎంపీపీ కార్యాలయం తనిఖీ

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని ఎంపీపీ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య మంగళవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఇందిరమ్మ గృహాలు, రాజీవ్ యువ వికాసంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

15 రోజులపాటు వేసవి శిబిరాలు



చేగుంట ఉన్నత పాఠశాల వేసవి శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రాధా కిషన్

- జిల్లా విద్యాధికారి రాధాకిషన్
- చేగుంట, రామాయంపేటలో వేసవి శిబిరాల సందర్శన

చేగుంట(తూప్రాన్)/రామాయంపేట(మెదక్): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వేసవి శిబిరాలు ఎంతో దోహదపడుతాయని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ తెలిపారు. చేగుంట ఉన్నత పాఠశాలలో, అలాగే.. రామాయంపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. జిల్లాలో మండలానికి ఒక పాఠశాలలో వేసవి శిబిరం ఏర్పాటు చేసినట్లు, యోగా, చిత్రలేఖనం, కుట్లు అల్లికలు, పాటలు పాడటం తదితర అంశాలపై 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వివరించారు. జిల్లా పరిధిలోని అన్ని క్యాంపుల్లో వంద మంది వరకు పిల్లలను చేర్చుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 15రోజుల పాటు నిర్వహించే వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. చేగుంటలో జరిగిన కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సంఘం నాయకులు వెంకటేశ్, స్వామి, నందూ, సుమతి, రేఖ, మంజులత, సంధ్య, అలాగే.. రామాయంపేటలో ఎంఈవో శ్రీనివాస్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, యోగా మాస్టర్ మద్దెల భవర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచే సృజనాత్మకత అవసరం

- అది అంగన్‌వాడీలతోనే సాధ్యం: మంత్రి సీతక్క
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే

మనోహరాబాద్(తూప్రాన్): చిన్నప్పటి నుంచే సృజనాత్మకతతో కూడిన విద్యాబోధన అవసరమని, అది అంగన్‌వాడీలతోనే సాధ్యమవుతుందని స్త్రీ,శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. నర్సాపూర్ సీడీపీఓ ఆధ్వర్యంలో మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేసిన చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మీ పిల్లలను అంగన్‌వాడీలలో చేర్పించాలని, కార్పొరేట్‌కు దీటుగా తమ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా చదువు చెప్పించడానికి కృషి చేస్తుందని చెప్పారు. కార్పొరేట్ స్కూళ్లలో జాయిన్ చేసి దుబారా ఖర్చు చేసుకోవద్దని, అంగన్‌వాడీలలో చేర్పించి ఆదా చేసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలలో 57 రకాల ఆట వస్తువులను, గర్భిణిల కోసం బెంచీలు, అవసరమైన పోషకాహారాన్ని అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. చిన్నారులకు సైతం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించిన ఐసీడీఎస్ అధికారులు, సహకరించిన టెక్నిప్ ఎఫ్ఎంసీ ఇండియా సంస్థను అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్, డీఆర్వో భుజంగరావు, జేడీ విశాలాక్షి, డీడబ్ల్యూఓ హైమావతి, గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, నర్సాపూర్ సీడీపీఓ హేమాభార్గవి, జిల్లా సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి సీతక్క, ప్రజాప్రతినిధులు

అలరించిన సాంస్కృతి కార్యక్రమాలు

ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకుముందు అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాళ్లు, చార్టర్లను మంత్రి సీతక్క పరిశీలించారు. అనంతరం టెక్నిప్ ఎఫ్ఎంసీ ఇండియా సంస్థ స్పాన్సర్‌తో విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను, మెమెంటోలను అందజేశారు.



చిన్నారులతో మంత్రి సీతక్క, నర్సారెడ్డి తదితరులు

క్లుప్తంగా

పిడుగుపాటుకు గేదెలు మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): పిడుగు పాటుకు పాడి గేదెలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మెట్‌పల్లిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బొస్కే చంద్రం రోజు మాదిరిగా పాడి గేదెలను వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఇంటికొచ్చాడు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా రెండు గేదెలు మృతి చెంది ఉన్నాయి. విషయం తెలుసుకున్న పశువైద్యురాలు మంజుల అక్కడకు చేరుకొని పరిశీలించి పిడుగుపాటుతోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. సుమారు రూ.లక్ష విలువైన పాడి గేదెలు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

విద్యుదాఘాతంతో మేకలు..

తొగుట(దుబ్బాక): విద్యుదాఘాతంతో మేకలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని లింగంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. తొగుట మండల కేంద్రానికి చెందిన ముచ్చర్ల రమేశ్ మేకలను పెంచుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగా ఉదయం మేతకు తీసుకెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికొస్తున్నాడు. లింగంపేట శివారులో పటేల్ చెరువు వద్ద ఆదివారం ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆ స్తంభాలకు కరెంట్ సరఫరా అవుతుంది. నీరు తాగేందుకు చెరువులోకి వెళ్తున్న క్రమంలో వైర్లకు తగిలి మూడు మేకలు మృతి చెందాయి. వాటి విలువ రూ.60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గ్రామస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రతీయేటా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ అన్నారు. మంగళవారం తెల్లాపూర్ గద్దర్ సర్కిల్ వద్ద అమృత, సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రతీయేటా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీల్లో 31 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇందులో మొదటి విజేతకు రూ.99,999, రెండో బహుమతి రూ.55,555, మూడో బహుమతి రూ. 33,333 నగదు అందించనున్నట్లు తెలిపారు.

పెట్టుబడి పేరుతో వ్యాపారి మోసం

రూ.1.74 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

దుబ్బాక : పెట్టిన పెట్టుబడికి తక్కువ కాలంలో రెట్టింపు డబ్బులు వస్తాయంటూ సైబర్ మోసగాళ్లు చెప్పిన మాటలు నమ్మి ఓ వ్యాపారి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన మహమ్మద్ సలాం అనే వ్యాపారి సెల్‌ఫోన్‌కు గతేడాది అక్టోబర్‌లో అమీలియా అనే గ్రూపునకు సంబంధించి లింక్ వచ్చింది. దానిని క్లిక్ చేయగా డబ్బులు పెట్టుబడి పెడితే తక్కువ కాలంలో రెట్టింపు డబ్బులు వస్తాయన్న వివరాలు ఉన్నాయి. సలాం దానిలో ఉన్న స్కానర్‌కు మొదట రూ.30 వేలు పంపగా వెంటనే రూ.60 వేలు వచ్చాయి. మరోసారి మళ్లీ రూ.30 వేలు పంపగా అలాగే వచ్చాయి. దీంతో అత్యాశతో రూ.1,74,999 ను ఆ లింక్‌లోని స్కానర్‌కు విడతల వారీగా పంపాడు. అప్పటి నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో మోసపోయాయని గుర్తించాడు. ఈ విషయాన్ని బాధితుడు 1930 కి కాల్‌చేసి ఫిర్యాదు చేయడంతో రూ.7 వేలు ఫ్రీజ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫలితాల్లో రోల్ మోడల్

పదేళ్లుగా పదిలో 100 శాతం ఉత్తీర్ణత

- ఆటల్లోనూ రాణిస్తున్న విద్యార్థులు
- ఆదర్శంగా నిలుస్తున్న టేక్మాల్ మోడల్ స్కూల్
- ఆరవ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆంగ్లంలోనే విద్యా బోధన
- 20 వరకు ఇంటర్‌లో దరఖాస్తులకు అవకాశం



టేక్మాల్ మోడల్ స్కూల్

శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుందన్న నానుడి నిజం చేస్తున్నారు టేక్మాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు. విద్యాబోధనలో మెళకువలు పాటిస్తూ.. ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలుస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ విద్యావ్యవస్థలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్న తలంపుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్ మంచి ఫలితాలను సాధిస్తూ శభాష్ అనిపించుకుంటుంది.

–టేక్మాల్(మెదక్)

జిల్లాలో 7 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయగా ఒక్కో పాఠశాలకు సుమారుగా 820 మంది విద్యార్థులు విద్యాబోధన చేస్తున్నారు. ఆరవ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆంగ్లంలోనే విద్యా బోధన నిర్వహిస్తున్నారు. జిల్లా అన్ని ప్రభుత్వ, మోడల్ స్కూల్ కంటే టేక్మాల్‌లోని మోడల్ స్కూల్‌లో మంచి ఫలితాలను సాధిస్తూ జిల్లాలోనే టాప్‌లో నిలుస్తున్నారు.

ఉత్తమ ఫలితాల్లో ఫస్ట్..

- క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తూ పాఠశాలలో పదవ తరగతి ప్రారంభమైన 2016 నుంచి పదవ తరగతిలో ఈ ఏడాది వరకు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు.
- ఈసారి పదవ తరగతిలో శ్రీజ 577 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, కార్తీక్ 572 మార్కులను సాధించి రెండో స్థానంలో నిలిచాడు. సుమారు 44 మందికి విద్యార్థులు 500లకి పైగా మార్కులు సాధించారు.
- ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 87 శాతం ఉత్తీర్ణత సాధించగా పాఠశాలకు చెందిన పూజ అనే విద్యార్థి 960 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.
- పాఠశాలలో నేషనల్ మిన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు పదులకొద్ది విద్యార్థులు ఎంపికవుతున్నారు.
- ముఖ్యంగా ప్రభుత్వ పరిధిలో ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో మోడల్ స్కూల్ అన్నింటి కంటే ఆదర్శంగా నిలుస్తోంది.
- ఇక్కడ చదువుతున్న విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో సైతం పట్టు సాధించి ఉన్నత విద్యకు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని పొందుతున్నారు.

ఇంటర్‌లో దరఖాస్తుల ఆహ్వానం

- 2025–26 సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.
- ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మొత్తంగా 150 సీట్లు అందుబాటులో ఉండగా పదవ తరగతి వచ్చిన మార్కుల మెరిట్ లిస్టు ప్రకారం విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో అవకాశం కల్పిస్తారు. ప్రస్తుతం మోడల్ స్కూల్లో ఎంపీసీ 40, బైపీసీ 40, సీఈసీ 40, ఎంఈసీ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- మొదటి సంవత్సరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. 20వ తేదీ వరకు గడువు కావడంతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. మోడల్ స్కూల్‌లో 100 మంది విద్యార్థినులకు ఉచిత వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు.



ఆటల్లోనూ అదుర్స్..

చదువుతోపాటూ పాఠశాలల్లోని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ, ఆటల్లోనూ తమ ప్రతిభ కనభరుస్తున్నారు. మండల స్థాయిని మొదలుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను కనబరుస్తున్నారు. యోగాలో తమకు దీటుగా ఎవరూ లేరంటూ జాతీయ స్థాయిలో బహుమతులు పొంది అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. వసతులు అంతత మాత్రమే ఉన్నప్పటికీ క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన ఉండటంతో పాఠశాలల్లో చేరేందుకు డిమాండ్ ఉంది.

సమష్టి కృషితో ఫలితాలు



కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యాబోధన నిర్వహిస్తున్నాం. పదేళ్లుగా పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం. ఇంటర్మీడియట్‌లో సైతం మంచి ఫలితాలు సాధిస్తున్నాం. పాఠశాలలోని ఉపాధ్యాయుల అందరి సమష్టి కృషితో ప్రతీ ఏడాది మంచి ఫలితాలను సాధిస్తున్నాం. చదువుతోపాటు విద్యార్థులు ఆటల్లో తమ ప్రతిభను కనబర్చి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ కార్యక్రమం నిర్వహిస్తాం.

– సుంకరి సాయిలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, టేక్మాల్

అనారోగ్యం తట్టుకోలేక ఉరేసుకొని ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

హుస్నాబాద్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. హనుమాన్ నగర్‌కు చెందిన గొర్ల శ్రీనివాస్ (40)కు భార్య లక్ష్మీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ఒక అమ్మాయికి వివాహం జరిగింది. శ్రీనివాస్ కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితోపాటు అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. భార్య కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. అనారోగ్య సమస్యలతో వేగలేక మనస్తాపం చెందిన శ్రీనివాస్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది..

గజ్వేల్‌రూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గజ్వేల్ పట్టణంలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. రాయపోల్ మండలం తిమ్మకపల్లికి చెందిన కామోజీ ఆంజనేయులు(45)కు నవనీతతో 14 ఏళ్ల కిందట వివాహం కాగా వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెయింటర్‌గా పని చేస్తున్న ఆంజనేయులు గజ్వేల్ పట్టణంలోని ఓ ఇంట్లో అద్దె కుంటున్నాడు. మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవ పడుతుండటంతో పిల్లలను తీసుకొని తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంజనేయులు గది నుంచి దుర్వాసన వస్తుండడంతో ఇంటి యజమాని వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే మృతుడి కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు 4న ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విచక్షణ రహిత జర్నలిజాన్ని ప్రోత్సహించొద్దు

సీనియర్ సంపాదకులు కే. శ్రీనివాస్



మాట్లాడుతున్న సీనియర్ సంపాదకులు శ్రీనివాస్

ములుగు(గజ్వేల్) : సోషల్ మీడియాలో జవాబుదారీతనం లేకపోవడంతో విచ్చలవిడితనం పెరిగిపోయిందని, రాజకీయ నాయకులు విచక్షణ రహిత జర్నలిజాన్ని ప్రోత్సహించొద్దని సీనియర్ సంపాదకులు, రచయిత కే. శ్రీనివాస్ పేర్కొన్నారు. గజ్వేల్ ప్రెస్‌క్లబ్ 25 ఏళ్ల వేడుకల(రజతోత్సవాలు) సందర్భంగా ములుగులోని ఓ ఫంక్షన్ హాల్‌లో 'జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్ అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు కే.విరాహత్ అలీతో కలిసి మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో ప్రింట్ జర్నలిజంలో వడపోత ప్రక్రియ ఉండేదని, ప్రస్తుతం ఎవరికి నచ్చినట్లు వారు ఏది పడితే అది మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కే. విరాహత్ అలీ మాట్లాడుతూ.. అక్షరజ్ఞానం లేనివారు, అల్లరి మూకలు మీడియా పేరు చెప్పుకొని ఇష్టారీతిన బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న విషయాలు తమ దృష్టికి వచ్చాయని, ఇలాంటి వారికి ప్రజా కోర్టులోనే గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ఎల్లం, టీ. నర్సింలు, జగదీశ్వర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ విజయమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలిపారు. మంగళవారం స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎల్.శ్రీను వివరాలు వెల్లడించారు. పట్టణ పరిధిలోని చెరువు సమీపంలో కొందరు వ్యక్తులు ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్నట్లు సమాచారం అందింది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు వెళ్లి దాడి చేసి కమల్ల శ్రీనివాస్, కూరపాటి శివప్రసాద్, నర్ర చంద్రబాబు, ఎల్ల నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.76,400 నగదు, 4 మొబైల్ ఫోన్లు, 3 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మరికొంత మంది పారిపోయారని, త్వరలోనే వారిని పట్టుకుంటామన్నారు. సమావేశంలో చేర్యాల ప్రొబేషనరీ ఎస్‌ఐ సమత, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి

నిజాంపేట(మెదక్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన నిజాంపేట మండల వెంకటపూర్ (కె) తండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాలోని బానోత్ దేవోజ్, భారతీ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కుటుంబ సమస్యల కారణంగా గత నెల 29న బానోత్ భారతీ (40) పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే నార్సింగ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది.

ముగ్గురి పైకి దూసుకెళ్లిన కారు

మహిళ మృతి, మరో ఇద్దరికి గాయాలు


మారవ్వ(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): వల్లభాపూర్‌లో కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు దాటుతున్న ముగ్గురి పైకి దూసుకెళ్లడంతో మహిళ మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నార్సింగి పరిధిలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు పోచమ్మల మారవ్వ(58), రామయ్యతోపాటు చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన దశరథం పని మీద రామాయంపేటకు వెళ్లి తిరిగి ఇంటికొస్తున్నారు. వల్లభాపూర్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా కామారెడ్డి వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను రామాయంపేట ప్రభుత్వ తరలిస్తుండగా మారవ్వ మృతి చెందింది. నార్సింగి పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

యువకుడిని బలిగొన్న కరెంట్ తీగలు

బాత్రూం డోర్ పట్టుకోగా విద్యుదాఘాతంతో మృతి


శివాజీ (ఫైల్)

హుస్నాబాద్: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన విషాద ఘటన హుస్నాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన ఉల్లెంగుల కొమురయ్య, స్వరూప దంపతుల కుమారుడు శివాజీ (17) రెండు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నారు. భోజనం చేసి బాత్రూంకు వెళ్దామని బయటకు రావడంతో కరెంట్ నిలిచిపోయింది. అప్పటికే ఈదురుగాలులకు బాత్రూంపై కరెంట్ తీగ తెగి పడింది. మళ్లీ కరెంట్ రాగా వైరు పడి ఉన్నది గమనించని శివాజీ బాత్రూంకు వెళ్తా డోర్ పట్టుకోగానే షాక్ కొట్టి పడిపోయాడు. ఇంట్లో ఉన్న అతడి సోదరి బయటకు వచ్చి శివాజీని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

కరెంట్ పునరుద్ధరణ పనులు చేస్తుండగా..

కొండపాక(గజ్వేల్): విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని వెలికట్ట శివారులో మంగళవారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. జగదేవ్‌పూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన అన్నమైన బాబు (22) కొంత కాలంగా విద్యుత్ సరఫరా పనుల నిర్వహణ కాంట్రాక్టర్ వద్ద కూలీ పనులు చేస్తున్నాడు. రెండు రోజులుగా వీస్తున్న ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయి కరెంట్ సరఫరా సమస్యలు తలెత్తాయి. జప్తి నాచారం గ్రామ శివారులో స్తంభాలను పాతిన అనంతరం కరెంట్ పునరుద్ధరణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి చేరాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు

దుబ్బాకరూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని హబ్సిపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. వంగ చంద్రగౌడ్(84) అదే గ్రామానికి చెందిన ఎండీ.చాంద్‌పాషా వద్ద పని చేసేవాడు. 4న పశువుల వద్దకు వెళ్లాడు. బీపీ ఎక్కువ కావడంతో కింద పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి చాంద్ పాషకు సమాచారం ఇచ్చి దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి సిద్దిపేటకు తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

పశువైద్యం.. దైవాదీనం!

మూగజీవాలకు అందని వైద్యం

- రెండు మండలాలకు ఒకటే ఆస్పత్రి
- సొంత భవనాలు కరువు
- చేర్యాల పట్టణ కేంద్రంలో బడిలో కొనసాగింపు
- ఆకునూరు ఆస్పత్రికి భవనం లేక నోచుకోని ఏర్పాటు
- భవనాలు నిర్మించాలని కోరుతున్న రైతులు


ప్రభుత్వ బడిలో నిర్వహిస్తున్న పశువైద్యశాల

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణంలో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా మారుతోంది. పట్టణ కేంద్రంలో పశువులకు వైద్యం అందించే పశు వైద్యశాలను కొన్నేళ్ల కిందట కూల్చి వేశారు. అనంతరం కొద్దిరోజులు స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆస్పత్రి నిర్వహించారు. అనంతరం సిద్దిపేట జనగామ ప్రధాన రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోకి మార్చారు.

చేర్యాల మండల వ్యాప్తంగా ఒక్కటే..

పట్టణ కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో గేదెలు 2,935, ఆవులు, ఎడ్లు 1,347, మేకలు 9,865, గొర్రెలు 25,354 ఉన్నాయి. ఉమ్మడి చేర్యాల మండల పశు వైద్యశాల గతంలో మద్రిముస్త్యాలలో ఉండేది. రైతులు పశు వైద్య సేవల నిమిత్తం అక్కడికి వెళ్లేవారు. 2016లో జరిగిన జిల్లా విభజన సమయంలో చేర్యాల మండలం కొమురవెల్లి, చేర్యాల రెండుగా విభజించబడింది. ఈ క్రమంలో చేర్యాల మండల పశు వైద్యశాలను ఆకునూరులో ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కానీ అక్కడ ఎలాంటి భవనం లేకపోవడంతో ఏర్పాటు చేయలేదు. మద్రిముస్త్యాల గ్రామం కొమురవెల్లి మండల పరిధిలోకి వెళ్లడంతో అక్కడి రైతులు పశువులకు వైద్యం అందించడానికి మద్రిముస్త్యాలకు వస్తున్నారు. చేర్యాల మండల వ్యాప్తంగా ఒక్కటే పశు వైద్యశాల ఉండటంతో ఇక్కడి రైతులు కూడా మద్రిముస్త్యాలకు వెళ్తా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే మండల పరిధిలోని ఆకునూరు, పట్టణ కేంద్రంలోని పశు వైద్యశాలలకు సొంత భవనాలు నిర్మించి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

నిధులున్నా ఆగిన భవనం

ఇది ఇలా ఉంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేర్యాలలోని స్థానిక అంగడి బజారులో ఉన్న పశు వైద్యశాల భవనాన్ని కూల్చి వేశారు. అప్పటి ప్రభుత్వం కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, స్థలం సేకరణ కూడా చేసింది. కొన్ని అనివార్య కారణాలతో భవన నిర్మాణం చేయలేదు. దీంతో వైద్య అధికారులు చేసేది ఏమి లేక వేర్వేరు భవనాల్లో ఆస్పత్రి నడిపిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. చేర్యాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో కొనసాగిస్తున్నారు. ఆకునూరుకు సంబంధించి కనీసం అద్దె భవనం కూడా దొరక్క ఏర్పాటు చేయలేదు.

బడిలో కొనసాగిస్తున్నాం



పట్టణ కేంద్రంలో సొంత భవనం లేకపోవడంతో మూతబడ్డ బడిలో వైద్య సేవలు అందిస్తున్నాం. పాత భవనాన్ని కూల్చి వేసిన అనంతరం లయన్స్‌క్లబ్ భవనంలో ఉండేది. వారు ఖాళీ చేయాలని చెప్పడంతో కలెక్టర్ అనుమతితో మూతబడ్డ బడిలోకి మార్చాం. గతంలో నిధులు మంజూరు చేసినా ప్రభుత్వం కొన్ని కారణాలతో నిర్మాణం చేయలేదు.

–రాజిరెడ్డి, పశు వైద్యశాఖ ఏడీ

భవనం కేటాయించాలి



మండలాల విభజన సందర్భంగా చేర్యాల మండల పశు వైద్య శాలను ఆకునూరులో ఏర్పాటు చేసేలా నిర్ణయించారు. అక్కడ ఎలాంటి భవనం కేటాయించకపోవడంతో ప్రస్తుతం కొమురవెల్లి మండలం మద్రిముస్త్యాల, చేర్యాల పట్టణ కేంద్రంలోని ఆస్పత్రి నుంచి సేవలు అందిస్తున్నాను. భవనం కేటాయిస్తే ఆకునూరులో వైద్య సేవలు ప్రారంభిస్తాం.

–విజయసారథి, మండల పశువైద్యాధికారి

మద్రిముస్త్యాలకు వెళ్లలేక పోతున్నాం



గతంలో మండల పశువైద్యశాల మద్రిముస్త్యాలలో ఉండేది. ఏదైనా మందులు అవసరం ఉంటే అక్కడికి వెళ్లి తెచ్చుకునే వాళ్లం. మండలం విడిపోయాక ఆకునూరుకు మార్చారు. కానీ అక్కడ ఆస్పత్రి లేదు. అలాగే పట్టణ కేంద్రంలోని ఆస్పత్రి కూల్చివేశారు. ప్రభుత్వ బడిలో నిర్వహిస్తున్నారు. ఇప్పుడు కూడా మద్రిముస్త్యాలకు వెళ్లాలంటే రైతులకు ఇబ్బంది అవుతుంది.

–భాస్కర్‌రెడ్డి, రైతు

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- సిద్దిపేట సీపీ అనురాధ
- హోంగార్డు సిబ్బందితో 'దర్బార్'


మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: యూనిఫామ్ వేసుకున్న ప్రతీ ఒక్కరికి క్రమశిక్షణ ముఖ్యమని యూనిఫామ్‌లో ఉన్న వారిని పది మంది గమనిస్తూ ఉంటారని అది తెలుసుకొని బాధ్యతగా విధులు నిర్వహించాలని సీపీ సూచించారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో హోంగార్డు సిబ్బందికి దర్బార్ నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. హోంగార్డ్స్ పోలీసు శాఖలో అంతర్గత భాగమే అన్నారు. హోంగార్డుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి దర్బార్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ పీఎస్‌లో పోలీసు సిబ్బందితో పాటు విధులు నిర్వహిస్తున్నారని, క్లిష్ట పరిస్థితుల్లో బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహించారని ఇక ముందు కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణి కుమార్, కార్తీక్, విష్ణుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీస్‌లపై దాడి

మద్దూరు(హుస్నాబాద్): నాటుసారా తయారీపై తనిఖీకి వెళ్లిన ఎక్సైజ్ ఎస్‌ఐపై ఓ వ్యక్తి దాడి చేసి గాయపర్చాడు. ఈ ఘటన దూల్మిట్ట మండలం దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధిలోని చెలిమితండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ కథనం మేరకు.. చెలిమితండాలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు చేర్యాల ఎక్సైజ్ ఎస్‌ఐ గుగులోతు సువర్ణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఫరిద్, కానిస్టేబుల్ రవి, శ్రీలత, నర్సింహులుతో కలిసి ప్రభుత్వ వాహనంలో తనిఖీలకు వెళ్లారు. తండాకు చెందిన పీర్యా ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తుండగా పక్క ఇంటిలో ఉన్న ముడావత్ సంతోష్ అనే వ్యక్తి ఎక్సైజ్ ఎస్‌ఐ, సిబ్బందిని దుర్భాషలాడుతూ సమీపంలో ఉన్న రాయిని తీసుకొని పైకి వచ్చినట్లు తెలిపారు. గ్రామస్తులు వారించగా తిరిగి ఇటుకతో విసిరిగొట్టగా ఎక్సైజ్ ఎస్‌ఐ సువర్ణ చేతికి గాయమైంది. తమ విధులకు ఆటంకం కలిగించి తనపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఎస్‌ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతోష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు షేక్ మహబూబ్ తెలిపారు.